వ్యాస కౌముది



# తులసీ రామాయణంలో సులోచన

ఆర్ శర్మ దంతుర్తి

[వాల్మీకి రామాయణం లేని కొన్ని విషయాలు తులసీ రామాయణంలో కనిపించి విస్మయం కలిగిస్తాయి. తులసీ రామాయణం లో కథ – సూతుడు శౌనకాది మునులకి, శుకమహర్షి పరీక్షిత్తుకి భాగవతం చెప్పాడన్నట్టుగా – శివుడు పార్వతి కి కాకభశుండి అనే ముని గరుడుడికి చెప్పినట్టూ, సాగుతుంది. తులసీ రామాయణంలో రాముడు అన్నీ తెల్సిన భగవంతుడు; దేవతలు వచ్చి రావణుణ్ణి చంపమనీ ఆలశ్యం చేయవద్దనీ అడిగినా, మరొకరితో మాట్లాడుతున్నా వాళ్ల మాటలు విని లోపల నవ్వుకుంటూ ఉంటాడు. కానీ వాల్మీకి రామాయణంలో రాముడు 'ఆత్మానం మానుషం మన్యే రామం దశరధాత్మజం' అనే మానవమాత్రుడు. అయితే తులసీ రామాయణంలో ప్రతీ ఒక్కరికీ రాముడు విష్ణువు అవతారం అని ముందే తెల్సినా రావణుడి ఆజ్ఞల వల్ల ఏమీ చేయలేరు. ఈ తులసీ రామాయణంలో సులోచన, రావణుడి కొడుకు ఇంద్రజిత్ లేదా మేఘనాధుడి భార్య.]

**మొదటి అంకం: సులోచన, తండ్రి వాసుకి నాగలోకంలో మంత్రాలోచన**

సులోచన: తండ్రీ, రావణుడు ఇంద్రజిత్ తో పాటు నాగలోకం మీదకి దండెత్తుకొచ్చి పధ్నాలుగు రోజులు గడిచాయి. మన నాగులు క్షయం అవుతూంటే ఏమీ చేయలేకపోతున్నాం. రావణుడికి బ్రహ్మ, పరమేశ్వరుడూ ఇచ్చిన వరాల వల్లా, ఇంద్రజిత్తుకి ఉన్న గ్రహ బలం వల్లా మనకి అపజయం తప్పదనేది తెలుస్తూనే ఉంది. అయితే ఒక ఉపాయం వల్ల దీన్ని నిరోధించవచ్చు. మీరు ఒప్పుకుంటానంటే...

వాసుకి: మన ప్రయత్నం మనం చేస్తునే ఉన్నాం, అయినా చెప్పు తల్లీ, వంశ క్షయం కాకుండా ఉండడానికి ఏమి చేయమన్నా నేను వినడానికి సిద్ధంగా ఉన్నాను.

సులోచన: రావణుడితో సంధి చేసుకుందాం. మనం ఓడిపోయినట్టూ కాదు అలాగని వాళ్ళు గెల్చినట్టూ కాకుండా.

వాసుకి: ఎలా కుదురుతుంది? రావణుడు కుబేరుడినే స్వంత అన్న అని చూడకుండా లంకలోంచి గెంటేసిన రాక్షసుడు. సంధికి ఒప్పుకుంటాడో లేదో?

సులోచన: ఇంద్రజిత్ మహావీరుడని విన్నాను. నన్ను ఆయనకి ఇచ్చి వివాహం చేస్తామనీ, యుద్ధం మాట వదిలేసి బంధువులం అవుదామనీ కబురు పంపి చూడండి.

వాసుకి: అమ్మా, నువ్వు? నీకు రాక్ష కుమారుడితో వివాహమా?

సులోచన: వంశ క్షయం కాకుండా ఉండడానికి నేను ఆ మాత్రం సహాయం చేయగలను కదా? నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నది. మీకు ఇష్టమైతే సంధికి ప్రయత్నం చేయండి.

వాసుకి: అమ్మా, మరో సారి ఆలోచించు. ఈ రాక్షసులు యుద్ధాలు ఎప్పటికీ ఆపరు ఎన్నాళ్ళైనా. రావణుడికి మామూలు మనుషుల చేతిలో చావు రాసిపెట్టి ఉంది. దానికోసం మహావిష్ణువు మానుషరూపంలో ముందు ముందు అవతరిస్తాడని కర్ణాకర్ణిగా విన్నాను. అప్పుడు జరిగే యుద్ధంలో రాక్షస వీరులు సమూలంగా తుడిచిపెట్టుకుపోతే పోయాక ఎవరు మిగుల్తారో చెప్పడం కష్టం. నీకు వైధవ్యం ...

సులోచన: అందరం ఓ రోజు పోవాల్సిన వాళ్ళమే కదా, ఇప్పుడు కాకపోతే తర్వాత. ఈ యుద్ధం ఆగకపోతే మొత్తం నాగులం అంతా ఇప్పుడే క్షయం కావొచ్చు. అయినా రావణుణ్ణి చంపడానికి మహావిష్ణువే మానుషరూపంలో వచ్చినప్పుడు ఆయనని కనులారా చూసే అదృష్టం, అవకాశం మనకి కలుగుతుంది కదా? ఆలోచించండి.

వాసుకి: సరే అయితే, రావణుడితో మాట్లాడి చూద్దాం ఏమంటాడో.

## రెండో అంకం: రావణుడితో సంధి ప్రయత్నం

వాసుకి: రావణా, నీ భుజబలం, ధైర్యం అభినందించదగ్గవి. ఇంద్రజిత్ చేసే యుద్ధం చూసి మా నాగ వీరులు కుదేలైపోతున్నారనేది సత్యం. నీతో శత్రుత్వం ఎందుకుకానీ, మన ఇద్దరి సైన్యం బాగా క్షయం అయ్యేలోపు సంధికి వప్పుకుంటావేమో అని పిలిచాను. నీకు ఇష్టమైతే ...

రావణ: (గర్వంగా) నేను జగదేకవీరుణ్ణి. కైలాసాన్ని నా భుజాల మీద మోసి పరమశివుణ్ణి మెప్పించి, యముణ్ణి ఓడించిన వీరాధివీరుణ్ణి. పిచ్చి, పిచ్చి సంధి ప్రయత్నాలకి వప్పుకుంటానా? వజ్ర వైఢూర్యాలూ, నగలూ అవీ నాకు పూచికపుల్లకి కొరగావు. ఏమిటి మీ సంధి ప్రయత్నం?

వాసుకి: నీ సంగతి తెలియకేం? వజ్ర వైఢూర్యాలకంటే అతి విలువైన నా కూతురు సులోచనని నీ కొడుకు ఇంద్రజిత్ కి ఇచ్చి వివాహం చేద్దామని, తద్వారా మనం వియ్యంకులం అయితే ఇద్దరికీ మంచిదనీ ఆలోచించాం. ఇంద్రజిత్ ఈ యుద్ధంలో చూపిస్తున్న పరాక్రమం చూసి సులోచన అతణ్ణి వరించడానికి ఇష్టం కనబర్చింది. అయితే ఇంద్రజిత్ ఏమంటాడో అని ….

రావణ: [కొంచెం ఆశ్చర్యంతో నవ్వుతూ, ఇంద్రజిత్ వైపు చూస్తూ…] ఏమంటావు నువ్వు? నీకు ఇష్టమేనా? నాగులతో వియ్యమొందడం మనకీ మంచిదే. సులోచన మన ఇంటి కోడలవడానికి మంధర తప్పకుండా ఒప్పుకోవచ్చు.

ఇంద్రజిత్: ఇప్పటికే సులోచన గురించి విన్నాను. అయితే నాదో కోరిక. నాగాస్త్రం గురించి, మిగతా ఆయుధాల గురించీ, సులోచన నాకు వివరంగా తెలియజేయాలి. వాటికి ఒప్పుకుంటే ఇష్టమే. వాటితో మనం మిగతా లోకాల మీద అధిపత్యం చలాయించడం కుదురుతుంది అతి సులభంగా.

రావణ: భేష్, అద్భుతమైన కోరిక. తండ్రికి తగ్గ తనయుడిననిపించావు.

వాసుకి: అమ్మాయి మీ ఇంట్లో అడుగుపెట్టాక మీ ఆడపడుచు. మా నాగ కన్యల పాతివ్రత్యం జగమెరిగినదే కదా! అయితే నాగాస్త్ర సంపద కోసం దీక్ష తీసుకుని దేవి కోసం తపస్సు చేయాల్సి ఉంటుంది.

రావణ: అద్భుతం. ఇంద్రజిత్ నాకు తగ్గ తనయుడే. తప్పకుండా తపస్సు చేసి తనకి కావాల్సినది సాధించుకోగలడు. ఏమీ సందేహం లేదు. మనం వియ్యమొందడానికి నాకేమీ అభ్యంతరం లేదు.

## మూడో అంకం: మేఘనాధుడు తపస్సుకి బయల్దేరడం

ఇంద్రజిత్: సులోచనా నేను నీవు చెప్పినట్టు దేవి గురించి తపస్సు చేయడానికి బయలు దేరబోతున్నాను. మన వివాహం అయ్యాక ఆలశ్యం అయింది. నా తపస్సు ఫలించేవరకూ …..

సులోచన: దేవి కనిపించడానికి మా తండ్రి వాసుకి చెప్పినట్టు ఘోరమైన తపస్సు చేయాలి. ఏమాత్రం మనసు నిలకడ లేకున్నా కష్టం. మరో మాట, దేవి కనికరించాక ఏమడగాలో ముందే జాగ్రత్తగా ఆలోచించుకోండి సుమా, లేకపోతే కుంభకర్ణుల వారికి వలే దురదృష్టం ప్రాప్తించవచ్చు.

ఇంద్రజిత్: తప్పకుండా గుర్తుపెట్టుకుంటాను.

సులోచన: విజయోస్తు. నేను కూడా మీ తపస్సు ఫలించాలని ఇక్కడ ప్రార్థిస్తూ ఉంటాను.

## నాలుగో అంకం: మేఘనాధుడి నాగాస్త్ర సంపాదన

ఇంద్రజిత్: నమస్తే సిద్ధ సేనాని ఆర్యే మందార వాసినీ, కుమారీ కాళికాపాలి కపిలే కృష్ణపింగళే
భద్రకాళి నమస్తుభ్యం మహాకాళి నమోఽస్తుతే, చండి చండీ నమస్తుభ్యం తారిణి వరవర్ణిని
కాత్యాయని మహాభాగే కరాళి విజయే జయే, శిఖిపింఛధ్వజధరే నానాభరణభూషితే
మహిషాసృక్ప్రియే నిత్యం కౌశికి పీతవాసిని, అట్టహాసే కోకముఖే నమస్తేఽస్తు రణప్రియే
ఉమే శాకంభరి శ్వేతే కృష్ణే కైటభనాశిని, హిరణ్యాక్షి విరూపాక్షి సుధూమ్రాక్షి నమోఽస్తు తే
వేదశ్రుతి మహాపుణ్యే బ్రహ్మణ్యే జాతవేదసి, జంబూకటక చైత్యేషు నిత్యం సన్నిహితాలయే
త్వం బ్రహ్మవిద్యా విద్యానాం మహానిద్రా చ దేహినామ్, స్కందమాతర్భగవతి దుర్గే కాంతారవాసిని
స్వాహాకారః స్వధా చైవ కలా కాష్ఠా సరస్వతీ, సావిత్రీ వేదమాతా చ తథా వేదాంత ఉచ్యతే
స్తుతాసి త్వం మహాదేవి విశుద్ధేనాంతరాత్మనా, జయో భవతు మే నిత్యం త్వత్ప్రసాదాద్రణాజిరే
కాంతార భయదుర్గేషు భక్తానాం చాలయేషు చ, నిత్యం వససి పాతాళే యుద్ధే జయసి దానవాన్
త్వం జంభనీ మోహినీ చ మాయా హ్రీః శ్రీస్తథైవ చ, సంధ్యా ప్రభావతీ చైవ సావిత్రీ జననీ తథా
తుష్టిః పుష్టిర్ధృతిర్దీప్తిశ్చంద్రాదిత్యవివర్ధినీ, భూతిర్భూతిమతాం సంఖ్యే వీక్ష్యసే సిద్ధచారణైః

దేవి: అద్భుతమైన నీ తపస్సు చూసి సంతోషించాను. మహేశ్వరుణ్ణి మెప్పించిన నీ తండ్రికి తగ్గ తనయుడననిపించావు. ఏమి కోరి ఈ తపస్సు మొదలుపెట్టావు? అమరత్వం తప్ప ఏదైనా సరే ఇవ్వగలను; కోరుకో.

ఇంద్రజిత్: ధన్యోస్మి. తల్లీ రాక్షస కులంలో పుట్టినందువల్ల, మా తండ్రి ఆజ్ఞాపించిన యుద్ధాలూ, అవి చేయకపోతే వచ్చే ఆక్షేపణలూ మాకు తప్పవు. మా చినతండ్రి విభీషణుడిలాగా 'పరమాపద గరిష్యాపి ధర్మే మమ మతిర్భవేత్' అని అడగగలను? పాము పడగనీడలో బతికేవాడిని నాకు అమరత్వం ఎందుకు? తండ్రి అజ్ఞ జవదాటకూడదనే ధర్మం ఒకటి ఉంది కదా నాకు ఆచరించడానికి? అందువల్ల ఏ యుద్ధం ముందు అయినా నీకు యజ్ఞం చేసి బలి ఇవ్వగానే నాకొక మాయా రథం వచ్చేటట్టూ, దాని మీద నుంచి నేను యుద్ధం చేస్తూ ఉంటే నేనెవరికీ కనిపించకుండా ఉండేటట్టూ, నన్నెవరూ జయించకుండా ఉండేటట్టూ అనుగ్రహించు.

దేవి: (నవ్వుతూ) తథాస్తు. నీ తండ్రి గురించి తెలిసీ అన్నింటికీ సిద్ధపడినవాడివి నిన్ను చూస్తే జాలి వేసినా, నువ్వు చెప్పినది నిజం. అయితే కొన్ని విషయాలు గుర్తుంచుకో. యుద్ధానికి బయల్దేరేముందు మాయా

రథం కోసం చేసే నీ యజ్ఞం పూర్తవకుండా మధ్యలో ఆగిననాడు నీకు చావు తప్పదు. ఎవరైతే పన్నెండేళ్ళ నుంచి పధ్నాలుగు ఏళ్ళు స్త్రీ సుఖం, నిద్రాహారాలు లేకుండా బ్రహ్మచర్యం అవలంబిస్తాడో వారినుంచి నీకు చావు రాబోతోంది. అప్పటివరకూ నేనిచ్చే ఈ అస్త్రం వల్ల నీకు అపజయం లేదు. దీనిలోంచి వెలువడే శక్తి నీ శతృవుని మూర్ఛపోగొట్టాక వాళ్ళకి ఒకరాత్రి ఉపచార క్రియలు చేయకపోతే మరణం తధ్యం. అయితే నీ శక్తి యుక్తులు, ఈ రథం, నాగాస్త్రం కూడా శ్రీచక్రోపాసకుల మీద పనిచేయవు. విజయోస్తు.

## ఐదో అంకం: మేఘనాధుడు రాముడి మీదకి రెండోసారి యుద్ధానికి బయల్దేరడం

రావణ: (ఏడుస్తూ) మేరువంతటి వాడా ధీర ప్రభావుడా
తోడ పుట్టిన వాడా కుంభకర్ణా
నీతి తప్పని వాడా ఖ్యాతినందెడి వాడా
ప్రియ భాషణాస్య విభీషణా

--- --- ---

తరుణ సుతులారా హితులారా తమ్ములారా
అనుగు జనులారా వనులారా దనుజులారా
సమర కోరాగ్నికీరీతి సమిధలగుచు
కదలిపోతిరి వీనినేకాకి జేసీ, ఏకాకి జేసీ

ఇంద్రజిత్: తండ్రీ, ఈ ఇంద్రజిత్ బతికున్నంతవరకూ మీరు ఏ బెంగా పెట్టుకోవద్దు. నిజమే, మనకి కావాల్సిన వారు చాలామంది వీరస్వర్గం అలంకరించారు. అయితే ఇప్పుడు మనకున్నవి రెండే దారులు. సీతాదేవిని తీసుకెళ్ళి కాకుస్థ వీరుడికి అప్పగించడమో లేదా నన్ను దీవించి రణభూమికి పంపడమో. మొదటిసారి యుద్ధంలో నేను రామలక్షణులని ఓడించి వచ్చాను కదా. నాగాస్త్రంతో వారు చనిపోయారనీ, దేవి వరం ఇస్తూ చెప్పినట్టూ ఒకరాత్రిలోపు వారికి ఉపచార క్రియలు ఎవరూ చేయలేరనీ అనుకున్నాం. కానీ చారుల వల్ల విన్నదేమంటే గరుడుడి వల్ల నాగాస్త్రం పనిరాకుండా పోయింది. విష్ణువుకే ఊడిగం చేసే గరుడుడు శ్రీచక్రోపాసకుడై ఉండవచ్చు. అయినా ఎందుకు చింత? నేను ఈ సారి మాయాసీతని తీసుకెళ్ళి వారి ముందే ఆవిడని తెగటార్చి వాళ్ళు తేరుకునేలోపు మరోసారి యజ్ఞం చేసి మాయా రథం సంపాదిస్తాను. నన్ను పంపండి చాలు.

రావణ: ఇప్పటివరకూ శోకించాను గానీ నీ మాటలు నాకు ధైర్యాన్నిస్తున్నాయి., ఇంత జరిగాక, ఇంత మందిని పోగొట్టుకుని వారి మరణాలు చూసాక జానకిని వెనక్కి ఇవ్వడం అనేది కల్ల. రాముడు నన్ను యుద్ధంలో చంపితే చంపుతాడు గాక. యుద్ధానికి పోయి విజయంతో తిరిగిరా.

ఇంద్రజిత్: అవశ్యం. విజయమో వీరస్వర్గమో.

రావణ: నిన్ను చూస్తూంటే నాకు కనిపించేది విజయమే. వెళ్ళిరా!

### ఆరో అంకం: రెండో యుద్ధానికి ముందు సులోచనతో మేఘనాధుడు

ఇంద్రజిత్: చూడబోతే నాకు కూడా సమయం ఆసన్నమైనట్టున్నది. రేపే యుద్ధానికి వెళ్తున్నాను రెండోసారి. విజయమో వీరస్వర్గమో.

సులోచన: నాధా అంత మాట అనకండి. దేవి ఇచ్చిన వరం గుర్తుంది కదా? మాయా రధం మీద యుద్ధానికి వెళ్తే ఎవరేమి చేయగలరు మిమ్మల్ని?

ఇంద్రజిత్: సులోచనా, నువ్వు జాగ్రత్తగా గమనించావా? నేను వేసిన నాగాస్త్రం పని చేయలేదు. లక్ష్మణుడు మొదటిసారి మూర్ఛపోయినపుడు మారుతి దివ్యౌషధాలు తెచ్చి బతికించాడు. రామలక్ష్మణులకి పట్టిన నాగ బంధం గరుడుడి వల్ల తొలగిపోయింది. ఇంత ఉంటాడు అని ఊహించలేని రూపు గల చినతండ్రి కుంభకర్ణుడు మనం సామాన్య మానవుడని తలిచిన రాఘవుడి చేతిలో హతమయ్యాడు, ఇవన్నీ తనకి ముందే తెలిసాయేమో అన్నట్టూ చినతండ్రి విభీషణుడు ....

సులోచన: విధిని ఎవరు తప్పించగలరు? రాఘవుడు సాక్షాత్తూ నారాయణావతారం అని చెప్పినా మామగారి మనసు మారలేదంటే మనం ఏమి చేయగలం?

ఇంద్రజిత్: మన రహస్యాలు అన్నీ శత్రువుకి చేరవేసే చినతండ్రి రాఘవుణ్ణి శరణు వేడాడు కదా? నాకు దేవి ఇచ్చిన వరం గురించి కూడా చెప్పే ఉంటాడు.

సులోచన: మీరు మామగారితో జానకిని రాఘవులకి తిరిగి ఇచ్చేయమని చెప్పరాదా?

ఇంద్రజిత్: (విరక్తితో నవ్వుతూ) చెప్పకేం? నా మాట వింటే ఈ పాటి యుద్ధమే జరిగి ఉండేది కాదు కదా? అన్నింటికన్నా వింత చెప్తున్నాను విను. నా తపస్సు అయ్యాక వరం ఇస్తూ దేవి చెప్పిన విషయమే – ఎవరు పన్నెండు నుంచి పధ్నాలు సంవత్సరాలు స్త్రీ సుఖం లేకుండా, బ్రహ్మచర్యం అవలంబిస్తాడో వారిచేతిలో నా చావు రాసిపెట్టి ఉంది. ఈ యుద్ధంలో కట్టెదుట కనబడే శత్రువు పన్నెండు నుంచి పధ్నాలుగు

సంవత్సరాలు స్త్రీ సుఖం లేకుండా, రాముడితో అడవుల్లో ఒంటరిగా తిరుగుతూ నిద్రాహారాలు మాని బ్రహ్మచర్యం అవలంబించిన లక్ష్మణుడు!!!

సులోచన: (అమితాశ్చర్యంతో) ఏమిటీ! (నిలబడలేక తూలుతుంది)

ఇంద్రజిత్: (సులోచన కింద పడిపోకుండా పట్టుకుని నిలకడగా కూర్చోబెట్టి), యుద్ధానికెళ్ళే ముందు మొదట చేయాల్సిన కొన్ని పనులున్నాయి. చెప్పాను కదా ఈసారి విజయమో వీరస్వర్గమో; నా విషయం నీకు ఎలాగో ఒకలాగ వార్త తెలియజేస్తాను.

## ఏడో అంకం: యుద్ధరంగంలో మేఘనాధుడు

ఇంద్రజిత్: (హనుమతో) ఓరీ ప్రచ్ఛన్న యుద్ధం అంటే దొంగచాటుగా లంకలో దిగి అశోకవనం ధ్వంసం చేయడం కాదు. కాసుకో ఈ ఆయుధం. దీని దెబ్బ తిన్నాక నువ్వు బతికి బట్టకడితే చూద్దాం.

హనుమ: మాటలతో ఏమౌతుంది? నిన్ను ఇప్పుడే యముడి దగ్గరకి పంపుతాను. నీ తమ్ముడు అక్షయకుమారుణ్ణి ఎవరు చంపారో అప్పుడే మర్చిపోయినట్టున్నావే? ధైర్యం ఉంటే నోరు మూసుకుని యుద్ధం సాగించు. ఇదిగో నువ్వు ప్రయోగించిన చచ్చు శూలం. నా వంటిమీద వెంట్రుక కూడా పీకడానికి పనికిరాదు. (శూలాన్ని మోకాలికి పెట్టి విరిచి పారేసి సింహనాదం).

ఇంద్రజిత్: మీతో ఇలా కాదు కానీ ఏం చేయాలో చూపిస్తాను చూడు. నా తండ్రికి సీత అంటే ఇష్టమేమో కానీ నాకు కాదు కదా? ఎవరికోసమైతే మీరందరూ ఈ సముద్రం దాటుకుని వచ్చారో ఆవిడ ఇక్కడే నా రథం మీద ఉంది. కనిపిస్తోందా? సరిగ్గా చూడు, ఈవిడ తలని ఇప్పుడే నరుకుతున్నాను. (మాయా సీత తల నరికి వికట్టహాసం).

హనుమ: (విభ్రాంతితో) ఆ, ఆ, ఆగు. ఆడవార్ని ఇలా చంపే నువ్వా ఒక వీరుడవే? (నీరసంగా).

ఇంద్రజిత్: ఫో, పోయి నువ్వు ఊడిగం చేసే ఆ దిక్కులేని రాముడితో, ఆయన కాళ్ళు కడిగే లక్షణుడితో చెప్పు. ఇలా నేను సీతని చంపాననీ, దిక్కున్న చోట చెప్పుకోమనీ. ఫో, పోయి తోటి కోతులతో అడవుల్లో ఆకూ అలం తింటూ బతుకు. (మాయమై పోతూ)

---

[హనుమ దగ్గిర మాయమైన ఇంద్రజిత్ జాంబవంతుడి దగ్గిర కనిపించి మరోసారి యుద్ధం]

---

జాంబవంతుడు: (తన ఎదురుగా ఉన్న ఇంద్రజిత్ తో) ఇప్పటికి కదా నా చేతికి అందావు. రా నీకు చేతనైతే నాతో యుద్ధం చేయి. నేను మిగతావారిలాగా వానరుణ్ణి కాదు సుమా.

ఇంద్రజిత్: ఓరీ, ముసలివాడివని వదిలాను కానీ నీతోనా యుద్ధం? సరే కాసుకో ఈ ఆయుధంతో నువ్వు బతికితే తర్వాత చూద్దాం.

జాంబవంతుడు: ఇదిగో నువ్వు ప్రయోగించిన ఆయుధం. దాన్ని మధ్యలోనే పట్టుకుని నీ మీదకే వదులుతున్నాను. (మూర్ఛపోయిన ఇంద్రజిత్ ని కాళ్ళు పట్టుకుని గిర గిర తిప్పి లంకవైపు విసిరేస్తాడు. ఇంద్రజిత్ శరీరం లంక ముఖద్వారం దగ్గిర పడుతుంది).

ఇంద్రజిత్: (మూర్ఛ లోంచి లేచి) ఈ వృద్ధుణ్ణి తక్కువ అంచనా వేశాను. మాయా సీతని చంపినట్టు చూసి ఈ వానరసేన, రామ లక్ష్మణులు నిర్వీర్యం అవుతారు. మళ్ళీ వాళ్ళు కోలుకునేసరికి రెండూ, మూడు రోజులు పట్టవచ్చు. ఈ లోపున మరో సారి యజ్ఞం చేసి దేవినుంచి రథం సంపాదించడం ఇప్పుడు మిగిలిన పని. ఆ రథం కానీ వచ్చిందా, మనకి అపజయం అనేదే లేదు. ఎవరక్కడ, నికుంభిల లో దేవి యజ్ఞానికి ఏర్పాట్లు చేయండి వెంఠనే. (నికుంభిల కి నడుస్తూ)

హనుమ: (రామలక్ష్మణులతో, కంట్లో నీరు కారుతూండగా) అయిపోయింది, అంతా అయిపోయింది. రామా మనం దేనికోసమైతే వచ్చామో అదంతా పనికిరానిదైపోయింది. నా కళ్ళ ఎదుటే ఇంద్రజిత్ అమ్మవార్ని వధించి ఆవిడ కుత్తుకతో లంకలోకి వెళ్ళాడు.

వానరసేన: ఏమిటీ? అయ్యో అయ్యో, నిజమా, నమశక్యం కావడం లేదు.

హనుమ: నాకు కూడా కానీ నా కళ్ళతో చూసినదే ఆ దుర్మార్గుడు చేసినపని.

జాంబవంతుడు: (నమ్మలేక) లేదే? నేను నా స్వహస్తాలతో వాణ్ణి మూర్ఛపోగొట్టి లంకలోకి విసిరాను కదా?

హనుమ: తాతా, నువ్వు వాణ్ణి ఎప్పుడు విసిరావో? నేను చూస్తూండగా వాడు అమ్మ తల నరకడం జరిగింది. ఆ తర్వాత వాడు నీ దగ్గిరకి యుద్ధానికి వచ్చి ఉండొచ్చు.

రాముడు: ఓ లక్ష్మణా, అయ్యో, ఈ బాధ సహించడం ఎలా? నేను సీతని వివాహం చేసుకున్నప్పుడు మీ వివాహం చాలాకాలం అన్యోన్యంగా ఉంటుందని దీవించిన మహర్షుల మాటలన్నీ వ్యర్థమేనా? ఇప్పుడు అయోధ్యకి ఏ మొహం పెట్టుకుని వెనక్కి వెళ్ళాలి? మా అమ్మాయి ఏదయ్యా అని అడిగితే జనకుడితో ఏమి చెప్పాలి? విశ్వామిత్రుడి నుంచి బ్రహ్మాస్త్రాదులు సంపాదించినా మీ అమ్మాయి ఇలా చచ్చిపోయింది అంటే నువ్వూ ఓ వీరుడివేనా అనడూ ఆయన? అయ్యో, అయోధ్యలో అమ్మలందరికీ ఏమి చెప్పాలి? ఇంతమంది వానరుల బలం, అన్నీ పోయినట్టేనా? (నిర్వీర్యమైపోయి ఏడుపు)

లక్ష్మణ: హనుమా నువ్వు సరిగ్గా చూసావా? కల కానీ భ్రమ కాదు కదా?

హనుమ: లక్ష్మణా, నేను సరిగ్గా చూడకపోతే అలా చెప్పి రాముడికి శోకం కలిగిస్తానా?

---

(కొంత సేపు గడిచాక)

---

విభీషణ: (అప్పుడే వస్తూ), ఏమిటి ఇక్కడ అందరూ ఇలా విచారంగా ఉన్నారు? అంతా క్షేమమేనా?

జాంబవంతుడు: అంతా అయిపోయింది నాయనా. మీ అన్న కొడుకు ఇంద్రజిత్ సీతాదేవిని తన రథం మీద తీసుకొచ్చి హనుమ చూస్తూండగానే ఆవిడ తల నరికి వెళ్ళిపోయాడు. ఎవరికోసమైతే ఈ శతయోజన విస్తీర్ణమైన సాగరం దాటామో ఆవిడని చంపేసాడు. ఇప్పుడింక మనకి ఇక్కడ పనేమీ లేదు. విచారం కాకపోతే సంతోషంగా ఎలా ఉంటాం?

విభీషణ: (ఆలోచిస్తూ) ఇదేమీ నమ్మదగ్గ వార్తలాగా లేదు నాకు. రాక్షస కులంలో అతి వృద్ధుల దగ్గిర్నుంచి, మా వదిన మంధరతో సహా అందరం సీతని రాముడికి తిరిగి ఇవ్వమని చెప్పాం అన్నతో. అయినా ఒప్పుకోక ఆవిడని లంకలోనే ఉంచాడు. ఇంద్రజిత్ సీతాదేవిని రథం మీద తీసుకెళ్తానంటే ఎలా వప్పుకుంటాడు రావణుడు? ఒప్పుకున్నా, ఆవిడ తల నరికే ధైర్యం ఇంద్రజిత్ కి ఎక్కడిది? రావణుడు ఏనాటికీ దానికి వప్పుకోడు. (కాసేపు ఆగి తల పంకిస్తూ). ఆ, ఇప్పుడు అర్థమైంది. ఇంద్రజిత్ ఏదో మాయ సీతను సృష్టించి ఉంటాడు. వాడికి యజ్ఞం చేసే సమయం కావాలి మాయా రథం సంపాదించడానికి. దానికోసం ఈ ఎత్తు వేసి ఉండొచ్చు. ఇప్పుడు వాడు నికుంభిల అనేచోట యజ్ఞానికి బయల్దేరి ఉండొచ్చు. ఒక పనిచేద్దాం. రాముడు నగరంలో ప్రవేశించడు కనక, నాతో పాటు హనుమ, అంగదాది వీరులనీ, లక్ష్మణుణ్ణీ పంపండి. మేము నికుంభిలకి వెళ్ళి వాడి యజ్ఞం పూర్తవకుండా అడ్డుకుందాం. అప్పుడు లక్ష్మణుడు ఇంద్రజిత్ ని సులభంగా చంపవచ్చు.

వానరులు: (ముక్త కంఠంతో). నిజం, నిజం విభీషణుడు చెప్పినది నిజం. రావణుడు సీతని తెగటార్చడానికి ఏనాటికీ వప్పుకోడు.

హనుమ: (పెద్ద గొంతుతో) జయత్యతి బలో రామో లక్ష్మణస్య మహాబలః

**ఎనిమిదో అంకం: నికుంభిల**

లక్ష్మణ: మేఘనాధా, యుద్ధమంటే పారిపోయి మాయల కోసం యజ్ఞం చేయడం కాదు. వచ్చి నీ ప్రతాపం చూపించు లేదా నీ కోసం యముడు కాసుకుని ఉన్నాడు, వెళ్ళి పలకరించు.

ఇంద్రజిత్: (మొహంలో కొంత ఆందోళన, విచారం) ఓరీ లక్ష్మణా మొన్నటికి మొన్న నిన్ను చంపితే ఈ హనుమ తెచ్చిన ఔషధం తో బతికి బయటపడి ఇప్పుడు నోటికి పని చెప్తున్నావు, నా పేరు ఇంద్రజిత్ అని గుర్తు పెట్టుకో. ఇంద్రుణ్ణి జయించిన నాకు నువ్వు ఓ లెక్కా?

(విభీషణుడికేసి చూస్తూ) ఇంతటి నీచానికి దిగి రాక్షస కులానికి ఎసరు పెట్టడానికి సిగ్గులేదా?

విభీషణ: అబ్బాయి, నీకూ, నా అన్న రావణుడీ తెలుసు నేను ధర్మం తప్పనివాణ్ణని. సీతని తీసుకొచ్చిన దగ్గిర్నుంచి ప్రతీరోజూ అన్నకి చెవినిల్లు కట్టుకుని చెప్పాను, ఆవిడని రాఘవుడికి తిరిగి ఇచ్చేయమని. ఒక్కసారైనా విన్నారా? చావు కట్టెదుట కనబడుతూంటే, అప్పుడు నేను చెప్పిన విషయాలు గుర్తురాక నన్ను గేలి చేస్తున్నావు. నాకు కులం కంటే, పితృసమానుడైన అన్నకంటే, ధనం కంటే, మొత్తం ప్రపంచం కంటే ధర్మం ఒకటే ఎక్కువ. దానికోసం నేను మొత్తం కుటుంబం, కులం, లంకా అన్నీ వదులుకుని వచ్చాను, రాముడి దగ్గిరకి, ఆయన ధర్మమూర్తి కనక. నన్ను గేలిచేసి ఉపయోగం ఏమిటి? లక్ష్మణుడు యుద్ధానికి పిలుస్తున్నాడు. వీరుడవైతే కాచుకో.

వానరసేన: (యజ్ఞానికి కావాల్సిన ద్రవ్యాలని చిందవందరగా విసిరేసి, హోమకుండంలో అగ్ని ఆర్పుతూ అరుపులు) రాక్షసా నీ పని ఈ రోజుతో సరి. రా, యుద్ధానికి రా. జయత్యతి బలో రామో లక్ష్మణస్య మహాబలః

లక్ష్మణ: ఈ బ్రహ్మాస్త్రంతో నీ పని సరి.

ఇంద్రజిత్: (చనిపోతూ) పడగనీడన బతకడం అసంభవం అని తెల్సినదే. ఇప్పుడు వగచి ప్రయోజనం లేదు. అయితే నా తండ్రికి చేయాల్సిన ధర్మం – రామభద్రుడు తన తండ్రికి చేసినట్టే చేసాను. సులోచనకి నా విషయం తెలియచేయాలనే చింత తప్ప మరేమీ లేదు.

విభీషణ: లక్ష్మణా, ఈ వీరుడి శరీరం నుంచి కుడిచేయి విడిపోయి సులోచన దగ్గిర పడేటట్టూ, తల విడిపడి రాముడి ముందు పడేటట్టు కొట్టు. మరో అస్త్రంతో. శరీరం లంక ముఖద్వారంలోనే పడనీయి.

వానరసేన: (ఇంద్రజిత్ శరీరం చుట్టూ చేరి) రామలక్ష్మణుల ముందు ఎవరు నిలవగలరు? రాక్షసవీరుడా, నీ బలపరాక్రమాలు అసామాన్యం. నీ తల్లి తండ్రులు ధన్యులయ్యేటట్టూ నువ్వు యుద్ధం చేసావు. వీర స్వర్గాన్ని అలంకరించు.

## తొమ్మిదో అంకం: అంతఃపురంలో సులోచన

సులోచన: (తన దగ్గిర్లో పడిన ఇంద్రజిత్ కుడి భుజం కేసి చూసి ఏడుస్తూ) ఇది నిజమా? ఈ కుడి భుజం, చేయి నా నాధుడిదేనా? మాయ కాదు కదా? ఎలా తెలుసుకోవడం? ఎవరక్కడ ఒక సుద్ద పట్టుకురండి. ఈ చేతి మీద కదిలే వేళ్ళు నాకు ఏదైనా చెప్పడానికి ప్రయత్నించడం లేదు కదా?

ఇంద్రజిత్: (కుడిభుజభాగం నేల మీద సుద్ద తో రాస్తూ) సులోచనా, రామ లక్షణులు అవతార పురుషులు. నీకు ముందు చెప్పినట్టుగానే యుద్ధంలో లక్ష్మణుడి చేతిలో హతమై, వీరస్వర్గాన్ని అలంకరించాను. నా శిరస్సు శ్రీరాముడి దగ్గిర ఉంది. నీకు వార్త తెలియచేయడానికి నేను అడిగినట్టూ, ఈ కుడి హస్తభాగం ఇక్కడపడేలాగ కొట్టాడు లక్ష్మణుడు.

సులోచన: (మంధర, రావణుల దగ్గిర) మామగారూ, నా నాధుడు హతమయ్యారు. సీత అనే మృత్యువుని మీరు స్వయంగా లంకకి తీసుకొచ్చి, మీరు బతికుండగానే మీ కోడలికి వైధవ్యం కలిగించారు. మీ చుట్టాలూ, తమ్ముళూ, పుత్రులూ కూడా పోయినా మీకు మాత్రం ఆ మృత్యువు మీద కోరిక పోవడం లేదు. ఇంద్రజిత్ పోయాక నాకు కూడా సమయం ఆసన్నమైనట్టే. ఆయన శిరస్సు రాముడి దగ్గిర ఉందని విన్నాను. దాన్ని తెప్పించి ఇప్పిస్తే ఆయనతోపాటు నేను కూడా ఆయనతో వీరస్వర్గానికి వెళ్ళాలని నా కోరిక.

రావణ: అదేం మాట సులోచనా? కుంభకర్ణుడు, అతికాయ, మహాకాయులూ అంత పెద్ద వీరులు కాదు. ఇంద్రజిత్ చాలా పోరాడాడు కానీ అలా అపజయం కలగడం ఒక్కొక్కప్పుడు సహజం. దానికే ఇంత బాధపడకూడదు. కైలాసాన్ని ఎత్తిన నేను ఇంకా బతికి ఉండగా నీకెందుకు భయం? ఇప్పటివరకూ నేను యుద్ధానికి వెళ్లలేదు కానీ ఒకసారి వెళ్లగానే వీళ్లందర్నీ చంపి నీకు సంతోషం కలిగించనా? ఏమీ అధైర్యపడవద్దు. మంధరా, సులోచనని లోపలకి తీసుకెళ్ళి స్వాంత వచనాలు చెప్పు. ఎవరక్కడ, రధం నా అస్త్రాలు సిద్ధంచేయండి. రాముడు ఇప్పుడు మన ప్రతాపం చూడబోతున్నాడు.

మంధర: (అంతఃపుర లోపలి గదుల్లో) సులోచనా, నీ మామగారు అన్నది విన్నావు కదా? ఈయనకి బలం వచ్చిన గర్వం వల్ల మనం అందరం నాశనం అవుతున్నాం. ధర్మ రక్షణ కోసం ఎటువంటి పనికైనా వెనుకాడని విభీషణుడు చెప్తేనే వినక ఆయనని ఇంట్లోంచి, లంకలోంచి పొమ్మన్నాడు. జరిగినది చూసావు కదా? విధిని మనం తప్పించలేము. ఇప్పుడు నువ్వు చేయగలిగే ఒక్క విషయం ఏమిటంటే, తిన్నగా రామభద్రుడి దగ్గిరకి వెళ్ళి ఇంద్రజిత్ శిరస్సు అడిగి తీసుకో. అడిగినవారికి ఏదీ ఇవ్వను అనేది ఏనాడూ అనలేదుట రాముడు. వెళ్ళిరా.

## పదో అంకం: రామ సన్నిధిలో సులోచన

రాముడు: ఎవరా వచ్చేది పల్లకీలో? విభీషణా నీకేమైనా తెలుసా?

విభీషణ: తెలియదు రామా, పల్లకీ రూపాకృతుల బట్టి వచ్చేది ఎవరో అంతఃపుర కాంత అయి ఉండొచ్చు.

రాముడు: హనుమా, ఆ వచ్చేదెవరో చూసి ఇక్కడకి తీసుకురా

సులోచన: (పల్లకీలోంచి దిగి) ఓం నమోనారాయణ, ఓం నమో నారాయణ, ధన్యోస్మి. యోగులకి ధ్యానంలో కూడా అంత సులభంగా కనిపించని మీ దివ్యమంగళ విగ్రహాన్ని ఈ రోజు చూడగలిగాను. ఇలా చూడగలనని మా తండ్రి నాకు వివాహం కాక పూర్వమే చెప్పారు.

విభీషణ: రామా ఈవిడ పేరు సులోచన. నాగలోకపు రాజు వాసుకి కుమార్తె. ఒకానొకపుడు రావణుడు ఇంద్రజిత్ తో సహా నాగలోకం మీదకి దండెత్తిన తర్వాత ఈవిడతో ఇంద్రజిత్ కి వివాహం జరిపించి సంధిచేసుకున్నాడు వాసుకి. మంచి నడవడి కలిగిన ఈవిడ మంధరతో సమానురాలైన పతివ్రత. ఇంద్రజిత్ యుద్ధంలో హతుడైనట్టు తెలిసి మిమ్మల్ని చూడడానికి వచ్చినట్టుంది.

రాముడు: సుగణవతీ, సులోచనా, నీ గురించి తెలిసి సంతోషమైంది. నీ భర్త కి ప్రాణదానం చేయడానికి సిద్ధంగా ఉన్నాను. మీరిద్దరు చిరకాలం లంకా రాజ్యం ఏలుకుంటూ సంతోషంగా ఉండవచ్చు.

వానరసేన: (తమలో) ఓహ్, ఓహ్, ఇంద్రజిత్ కి ప్రాణదానం చేసి లంకా రాజ్యం ఇస్తే రాఘవుడు విభీషణుడికి ఇచ్చిన మాటేమిటి? ఇది అసలు జరిగే పనేనా?

సులోచన: (ఒక్క క్షణం మౌనం తర్వాత) నా నాధుడు తన పరాక్రమం చేత ఇంద్రుణ్ణి ఓడించిన మేటి వీరుడు. ఇప్పుడీ యుద్ధంలో లక్ష్మణుడికి తన ప్రాణం దానం చేశాడు. బలి చక్రవర్తి నుంచి ఇప్పటివరకూ రాక్షసులమైనా మేము మీకు దానం ఇచ్చినది ఎప్పుడైనా వెనక్కి తీసుకున్నట్టు విన్నామా? అలా మా నాధుడు ఇచ్చిన దానం నేను వెనక్కి తీసుకోవడానికి ఏ కారణమూ కనిపించదు. అది అధర్మం అవుతుంది కూడా. లేదు, లేదు ఇప్పుడింక నేనీ సాంసారిక జీవితానికి స్వస్తిచెప్పి నా నాధుడితో వీరస్వర్గం అలంకరించదలిచాను. నన్ను ఆశీర్వదించి నా నాధుడి శిరస్సు ఇప్పించండి అంతకన్నా కోరేదేమీ లేదు. మిమ్మల్ని మానుషరూపంలో చూడగలిగాను, ధన్యోస్మి. నమో నారాయణాయ.

రాముడు: తధాస్తు. ఇంద్రజిత్ వీరస్వర్గం అలంకరించిన వీరాధివీరుడు. నీవు అటువంటి వీరుడికి తగిన ధర్మపత్నివని నిరూపించావు. సుగ్రీవా ఇంద్రజిత్ శిరస్సు ఈవిడ పరం చేయి.

## పదకొండొవ అంకం: సులోచన అంతిమ ప్రయాణం

సులోచన: (చితి మీద ఇంద్రజిత్ తల తన వడిలో పెట్టుకుని, కళ్ళుమూసుకుని) రామ రామ రామ…

రావణుడు: (ఒకే ఒక క్షణంలో ఇంద్రజిత్, సులోచన భస్మమవడం చూసి తనలో) నాకూ సమయం ఆసన్నమైనట్టే. నా కడుపులో ఉన్న అమృతభాండం గురించి విభీషణుడు తప్పక రాముడికి చెప్పితీరుతాడు. ఇంతవరకూ వచ్చాక దాసోహం కోసలేంద్రస్య అంటూ సీతని వెనక్కి ఇవ్వడమా? అందర్నీ పోగొట్టుకున్నాక ప్రాణం మీద తీపితో రాముణ్ణి శరణుజొచ్చాడని చెప్పుకోదూ లోకం? ఛీ, ఛీ, రాముడి చేతిలో చావడమే మంచిది. రాముడు, రాముడు.. తాను బ్రహ్మని వరం అడిగినపుడు మనుషులవల్ల పెద్ద గండం ఉండదనుకుంటే ఈ మహావిష్ణువు మనిషి రూపంలోనే వచ్చాడన్నమాట. రామ రామ రామ…

వానరసేన: (దూరంనుంచి అరుపులు) *జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః*
*రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః*
దాసోహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః ॥

★★★

COMMENTS